www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 1 డిసెంబర్ 2022



నేటి నుంచి చిత్తూరులో 'అమర స్లీప్ క్లినిక్' సేవలు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్ : చిత్తూరు పట్టణం నందు తిరుపతిలో ఉండు అమర హాస్పిటల్ స్లీప్ మెడిసిన్ విభాగంలో అంతర్జాతీయ నైపుణ్యం తో కలిగిన డాక్టర్ల బందం తో పాటు అత్యాధునిక సౌకర్యాలు కలిగిన అమర ఆస్పత్రి వారు చిత్తూరులోని ప్రీతం హాస్పిటల్ నందు స్లీప్ మెడిసిన్ ఔట్ రీచ్ క్లినిక్ ను చిత్తూరు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వై. రిశాంత్ రెడ్డి చేతులమీదుగా డిసెంబర్ 1 వ తారీఖున ఉదయం 10.00 గంటలకు గురువారం ప్రారంభించనున్నారు. డిసెంబర్ నెల నుంచి ప్రీతం హాస్పిటల్ చిత్తూరు నందు స్లీప్ మెడిసిన్ అవుట్ రిచ్ క్లినిక్ నందు ప్రతినెల మొదటి గురువారం మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి గౌరీనేని అందుబాటులో ఉంటారని తెలియజేశారు. ఈరోజుల్లో చాలా మందికి వృత్తిరీత్యాగాని, పర్సనల్ సమస్యలతో నిద్ర పట్టకపోవడం, విపరీతంగా నిద్రపోవడం, గురక రావడం తదితర సమస్యలకు పరిష్కారం చూపుతారన్నారు.

పిల్లలకు ఇవ్వగలిగే ఆస్తి 'చదువే'

'విద్యాదీవెన'కు రూ.23.40 కోట్లు జమ



జగనన్న విద్యాదీవెన చెక్కులు అందజేస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

రాష్ట్రంలోని ప్రతి బిడ్డా చదువుకోవాలన్నదే తమ ప్రభుత్వ ఆకాంక్షని, పిల్లలకు మనం ఇవ్వగలిగే ఆస్తి చదువేనని మదనపల్లి సభలో లాంఛనంగా 'విద్యాదీవెన' నిధులను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి తల్లుల ఖాతాలో జమ చేశారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యాదీవెన కింద నాలుగో త్రైమాసికానికి జిల్లాలోని 37,328 మంది తల్లుల ఖాతాలకు రూ.23.40 కోట్లు జమ చేశామన్నారు. కలెక్టర్ ఎం.హరినారాయణన్, నగర మేయర్ అముద, స్త్రీ శిశు సంక్షేమ శాఖ రాయలసీమ రీజియన్ ఛైర్‌పర్సన్ శైలజా చరణ్‌రెడ్డి, జడ్‌పి సిఇఒ ప్రభాకర్‌రెడ్డి, బిసి సాంఘిక సంక్షేమ శాఖ, ట్రైబల్, మైనార్టీ సంక్షేమ అధికారులు రబ్బానీ బాషా, మూర్తి, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

వర్కుషాపులో రాష్ట్ర నాయకుల పిలుపు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

చిత్తూరు జిల్లా ఎనిమిదవ సిఐటియు జిల్లా మహాసభలు డిసెంబర్ 19, 20 తేదీల్లో చిత్తూరు నగరంలోని రెవెన్యూ భవన్లో జరగనున్నాయని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ దేశంలోని కార్మిక సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న ఏకైక పెద్ద కార్మిక సంఘం సిఐటియు అని అన్నారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి కార్మిక పోరాటాలను సమీక్ష చేసుకుని భవిష్యత్ పోరాటాలకు పదును పెట్టేలా మహాసభలను జయప్రదం



సిఐటియు జిల్లా వర్క్ షాప్‌లో పాల్గొన్న వివిధ ట్రేడ్ యూనియన్ల నాయకులు



సిఐటియు జిల్లా వర్క్ షాప్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు

చేయాలన్నారు. జిల్లా విభజన అయిన తరువాత మొట్టమొదటిసారిగా మహాసభలు జరుగుతున్నాయన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కోట్లాదిమంది కార్మికల ఉపాధి దెబ్బతీస్తున్నారన్నారు. దీనికి వత్తాసు పలుకుతూ రాష్ట్ర ప్రభుత్వం సైతం కార్మికులకు ఎలాంటి వేతనాలు పెంచకుండా పోరాడుతున్న కార్మికులపై నిర్బంధం విధిస్తోందన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వాడా గంగరాజు, చైతన్య మాట్లాడుతూ నూతన జిల్లా ఏర్పాటైన తరువాత పవర్‌లూం కార్మికులకు వేతనాల కోసం పోరాటం చేశామని, అంగన్‌వాడీ, ఆశ, విఒఎ, పంచాయతీ, చింతపండు కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు జరిగాయన్నారు. జిల్లాలో పెద్దసంఖ్యలో ఉన్న గ్రానైట్ కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. సిఐటియు ఎంత బలపడితే కార్మికుల సమస్యలు అంత తొందరగా పరిష్కారం అవుతాయన్నారు. ఈ వర్క్ షాప్ లో సిఐటియు జిల్లా నాయకులు గిరిధర్ గుప్తా, భువనేశ్వరి ,సురేంద్ర, అంగన్వాడి యూనియన్ జిల్లా కార్యదర్శి షకీలా, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గోవిందప్ప, పవర్‌లూం జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్, ఆశ, వీవోఏ, మధ్యాహ్న భోజనం, హమాలి, బిల్డింగ్, ఆటో తదితర రంగాల నుండి పాల్గొన్నారు.

ఈజ్ ఆఫ్ లివింగ్ సర్వేలో భాగస్వాములు కండి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : ఉత్తమ నివాసయోగ్యమైన నగరాల ఎంపికలో భాగంగా కేంద్ర పట్టణాభివద్ధి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న "ఈజ్ ఆఫ్ లివింగ్ 2022" సర్వేలో నగర వాసులు భాగస్వాములు కావాలని నగర కమిషనర్ డా.జె అరుణ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా ఉత్తమ నివాసయోగ్య నగరాలను ఎంపిక చేస్తుందన్నారు. ఈ పోటీల్లో చిత్తూరు నగరపాలక సంస్థ పాల్గొంటుందని వివరించారు. నగరంలో ప్రజలు సౌకర్యవంతంగా జీవించడానికి అవసరమైన చర్యలను రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ శాఖలు, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు చెప్పారు. నగరపాలక పరిధిలో పౌరులకు పౌర సేవలను వార్డు సచివాలయాల ద్వారా క్షేత్రస్థాయిలోనే అందుబాటులోకి తేవడం, నగర ప్రజల ఆరోగ్య, ఆహ్లాదకర జీవనానికి అవసరమైన పార్కులు అభివద్ధి చేయడం, కాలుష్య నియంత్రణకు కూడళ్లలో ఉద్యానవనాలను ఏర్పాటు చేయడం, రోడ్ల వెంబడి పచ్చదనం పెంపొందించడం, ప్రతి ఇంటి నుంచి తడి పొడి చెత్త సేకరణ, పట్టణ ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు, నీటి సరఫరా తదితర అంశాలకు సంబంధించి ప్రజలు తన అభిప్రాయాలను పంచుకోవాలన్నారు. నగర అభివద్ధిలో స్థానిక యువత, మహిళలు, నగర ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నివాసయోగ్యమైన నగరాల్లో చిత్తూరు నగరాన్ని ఉత్తమ నగరంగా ఎంపిక చేసేందుకు "ఈజ్ ఆఫ్ లివింగ్ 2022" సర్వేలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు నగరపాలక సంస్థ ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌లను సంప్రదించాలని తెలిపారు.

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరులోని ఎస్టీయూ కార్యాలయంలో భారత కమ్యూనిస్టు పార్టీ సమావేశం గోపీనాథ్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు, సహాయ కార్యదర్శి జనార్దన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మంచి ఆశయంతో నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టాలని చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. గ్రామాల్లో మూడు సెంట్లు మంజూరు చేయాలని.. పట్టణాల్లో రెండు సెంట్ల భూమి మంజూరు. చేయాలని డిమాండు చేశారు. ప్రభుత్వం ఇస్తున్న సెంటు, ఒకటిన్నర సెంట్లలో ఇల్లు నిర్మించుకోవాలన్నా.. మంజూరు చేస్తున్న డబ్బులు చాలకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. ప్రభుత్వం కనీసం ఇంటికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించాలని కోరారు.

ఏలుమలై మృతి కేసులో ఇద్దరి అరెస్టు



ప్రజాశక్తి -రామకుప్పం: మండల పరిధిలోని పంద్యాలమడుగు పంచాయతీ, ఎస్.గొల్లపల్లి గ్రామంలో 89 పెద్దూరు గ్రామానికి చెందిన సెల్వమ్ కొడుకు ఏలుమలై అలియాస్ ముత్తు నాలుగు రోజుల క్రితం అనుమానస్పదంగా మృతి చెందిన కేసులో బుధవారం ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు రామకుప్పం ఎస్ఐ సి. ఉమామహేశ్వర్ రెడ్డి తెలిపారు. కాగా మృతుడు తెలుగుదేశం పార్టీకి చెందిన వార్డు సభ్యుడు కావడంతో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పోలీసు ఉన్నతాధికారులకు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో పలమనేరు డిఎస్‌పి సుధాకర్ రెడ్డి ఇటీవలి ఘటనా ప్రాంతాన్ని పరిశీలించి ఈ కేసు పై దర్యాప్తును వేగవంతం చేయాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఏలుమలై మరణానికి గల కారణాలను వెలికి తీయడం జరిగిందని బుధవారం ఎస్ఐ తెలిపారు. దర్యాప్తులో ముద్దాయి శివగామితో మృతుడు ఏలుమలై ఏ.ముత్తు వివాహేతర సంబంధం ఏర్పరచుకొని, ఆమె ప్రోద్బలంతోనే మృతుడు ఏలుమలై శివగామి ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకొని చనిపోవడంతో ఆటోలో చికిత్స కోసం ఆర్.ఎం.పి డాక్టర్ వద్దకు పోయే లోపే ఏలుమలై చనిపోవడంతో, డెడ్ బాడిని పల్లికుప్పం గ్రామానికి చెందిన కాంతరాజ్ ద్వారా ననియాల ఏనుగుల షెడ్ వెనుక అటవీ ప్రాంతంలో పడవేశారన్నారు. ఈ కేసులోని ముద్దాయిలు శివగామి, కాంతరాజ్‌లను బుధవారం చెలిమిచెను తాండా బస్ షెల్టర్ వద్ద అరెస్టు చేసి, నేరానికి ఉపయోగించిన లగేజ్ ఆటోను కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హమాలీ కార్మికులకు కూలి ధరలు పెంచాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఏపీఎస్‌బీసీఎల్‌లోని లోడింగ్.. అన్ లోడింగ్ చేస్తున్న హమాలీ కార్మికులకు కూలీ ధరలు పెంచాలని, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, అరియర్స్ ఇవ్వాలని, కాంట్రాక్టర్ చేసుకున్న ఒప్పందం ప్రకారం అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు బుధవారం చిత్తూరు వడ్డేపల్లి వద్దనున్న ఐఎంఎఫ్ఎల్ చిత్తూరు డిపో వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హమాలీ కార్మికులు అర్ధ నగ్నంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయకులు నాగరాజు, సత్యమూర్తి మాట్లాడుతూ కాంట్రాక్టు ఒప్పందం చేసుకొని సంవత్సరం పూర్తి అవుతున్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. వెంటనే కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే ఏఐటీయూసీ నాయకత్వంలో నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు, మంత్రి జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

స్థానిక వ్యాపారులకే గదులు కేటాయించాలి

ప్రజాశక్తి-నగరి: నగరిలోని వీధి విక్రయదారులను ఆదుకోవాలని.. మున్సిపాలిటీలో కొత్తగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంగణంలో స్థానికంగా ఉన్నవారికే గదులు కేటాయించాలని కోరుతూ కమిషనర్ వెంకట్రామిరెడ్డికి, మున్సిపల్ ఛైర్మన్ నీలమేఘం, వార్డు కౌన్సిలర్లకు బుధవారం వీధివిక్రయ దారుల సంఘం ఏఐటీయూసీ అనుబంధం ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ నగరి మున్సిపాలిటీలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడానికి స్వాగతిస్తున్నామని.. గదులు కేటాయింపులో పారదర్శకతతో గదులు కేటాయించాలని కోరారు. వ్యాపారానికి సంబంధం లేకుండా గదులు తీసుకొని బినామీలకు రెట్టింపు బాడుగులకు ఇవ్వడం జరుగుతోందని.. నగరి మున్సిపాలిటీలో మొదటి నుంచి ఈ పద్ధతిని కొనసాగిస్తున్నారని వాపోయారు.వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డులు ఇచ్చి వారిని ఆదుకోవాలని డిమాండు చేశారు, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని.. నిర్మాణాన్ని అడ్డుకుంటామని తెలిపారు.

ప్రజారోగ్య పరిరక్షణ పంచాయతీ కార్యదర్శుల కర్తవ్యం

జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రజారోగ్య పరిరక్షణ పంచాయతీ కార్యదర్శుల ప్రధాన కర్తవ్యమని, మరింత బాధ్యతతో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హరి నారాయణన్ అన్నారు. బుధవారం మధ్యాహ్నం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరం నుంచి జిల్లా కలెక్టర్ డీపీవో లక్ష్మీ, డీసీడీపీఆర్‌సీ షణ్ముగరామ్‌తో కలసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వమిత్వ, శానిటేషన్, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, పన్నుల వసూలు తదితర అంశాలపై ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ల పై పంచాయతీ కార్యదర్శులు అవగాహన పెంచుకుని వాటిని అమలు చేయాలని, ఈ నియమ నిబంధనలను సక్రమంగా అమలు చేయకపోతే అందుకు పూర్తి బాధ్యత కార్యదర్శులే వహించాల్సి ఉంటుందన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు అధిక ప్రాధ్యాన్యత ఇవ్వాలని తెలిపారు. స్వమిత్వ (గ్రామకంఠం) రీసర్వే కు సంబంధించి ఈవోపీఆర్డీలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఈ ప్రక్రియ పై అవగాహన పెంచుకోవాలని.. కార్యదర్శులకు ఈ సర్వే పకడ్బందీగా చేసేందుకు సర్వే అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. స్వమిత్వ కు సంబంధించి 739 గ్రామాలలో డ్రోన్ ఫ్లై పూర్తి కాగా.. ఓఆర్ఐ మ్యాప్ -1లు 96 అందగా, గ్రౌండ్ ట్రూతింగ్ 12 గ్రామాల్లో పూర్తి అయ్యిందని, 83 గ్రామాలలో జరుగుతోందని..42 అంశాల తో కూడిన ప్రొఫార్మాను ప్రతి ఇంటి వద్ద సమయం కేటాయించి కొలతలు పక్కగా చేసిన అనంతరం పూర్తి చేయాలన్నారు. పూర్తి వివరాలను సేకరించాలని, ఇందులో ఎలాంటి తప్పొప్పులకు తావు ఉండరాదని సూచించారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలకు సంబంధించి కొత్తగా మంజూరైన 94 షెడ్ లకు గానూ 4 షెడ్ లు పూర్తి కాగా 21 పురోగతిలో ఉన్నాయని.. మిగిలిన 69 షెడ్ ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని తెలిపారు. కేంద్రాల నుంచి వర్మీ కంపోస్ట్ తయారు చేయడం ద్వారా ఆదాయం పొందాలన్నారు. ప్రతి 15 రోజులకోసారి వాటర్ ట్యాంకులను శుభ్రం చేయడం విధిగా జరగాలని, పైపులైన్ల మరమ్మతులు ఎప్పటికప్పుడు చేయాలని తెలిపారు. గ్రామాలలో వీధి దీపాల నిర్వహణ, పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని.. అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.



లేబర్ బడ్జెట్ ప్రకారం అంచనాలను చేరాలి

ప్రభుత్వం నిర్దేశించిన మేరకు వేతన దినాలను.. ప్రాధాన్యతా పనులను కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎం .హరినారయణన్ అన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో డ్వామా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు నిర్దేశించిన వేతన దినాలను తప్పనిసరిగా కూలీలకు కల్పించేలా చూడాలన్నారు. చానల్స్ పునర్నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గహ నిర్మాణ పనులకు సంబంధించి 90 పని దినాలు తప్పనిసరిగా కల్పించాలన్నారు. ఈ ఏడాది అమత్ సరోవర్ పనులు మండలానికి ఒకటి చొప్పున నిర్వహించడం జరిగిందని.. వచ్చే ఏడాదికి 75 పనులను జిల్లా వ్యాప్తంగా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామ సభలు పెట్టి పనులను నిర్ణయించుకోవాలని.. డిసెంబర్ 15 లోపు ప్రతి గ్రామానికి కావాల్సిన ప్రాధాన్యత పనులను గ్రామ సభలలోనే గుర్తించాలని సూచించారు. పనుల గుర్తింపులో వెనుకబడిన ఏపీడీలను కారణాలు అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్‌లో లక్ష్యాలను సాధించడం కొంత ఇబ్బందికరంగా ఉంటుందని.. ఫిబ్రవరి, మార్చి నెలల్లో సాధారణ దినాలు కంటే ఎక్కువ పని దినాలను కల్పించడం జరుగుతుందని పీడీ చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీలు ఉమావాణి, సుబ్రహ్మణ్యం, వరప్రసాద్, వెంకటరత్నం, శోభన్ బాబు, శ్రీనివాసులు, సునీల్ కుమార్, భాగ్యలక్ష్మి, గంగాభవాని, చిన్న రెడ్డెప్ప, ప్రియదర్శిని, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

గడువులోపు స్పందన అర్జీలను పరిష్కరించాలి

ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందని.. క్షేత్ర స్థాయిలో నిర్లక్ష్యం తగదని.. సకాలంలో స్పందించి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. హరినారాయణన్ అన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధానంగా జిల్లాలో స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు సకాలంలో స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రీ ఓపెన్ కాకూడదని.. అలా జరిగితే సంబంధిత అధికారులు భాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. వారం రోజుల లోపల పరిష్కారం కావాల్సి ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కారం చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న ఎస్‌డీసీ సర్వేను అధికారులు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్. రాజశేఖర్, జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్




ప్రజాశక్తి-సోమల: కందూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. పాఠశాలలో 20 మంది విద్యార్థులు వివిధ రకాల నమూనాలను, ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. మండల స్థాయిలో ఐదు ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసినట్టు ప్రధానోపాధ్యాయులు హరినాథ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మండలస్థాయికి ఐదు ప్రదర్శనల ఎంపిక



గంగాధరనెల్లూరు: పాఠశాల స్థాయిలో నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో తూగుండ్రం హైస్కూల్ కి చెందిన విద్యార్థులు ప్రదర్శించిన 5 ప్రదర్శనలు మండల స్థాయికి ఎంపికైనట్లు హెచ్.ఎం. శరవణరెడ్డి తెలిపారు. బుధవారం నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవి, రమణ, హరి, కల్పన , విద్యార్థులు పాల్గొన్నారు.

చౌడేపల్లె: చౌడేపల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో బుధవారం వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను ఉంచారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు వెంకట శివప్రసాద్ మాట్లాడుతూ మానవుని జీవితం సుఖమయం చేసుకోవడానికి సైన్స్ ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు.



ఆధునిక పరిజ్ఞానంతో ప్రపంచం ఎంతో అభివద్ధి సాధించిందని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో కొత్త పరిశోధనలపై దష్టి సారించి దేశ పురోభివద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మురళీ, ఈశ్వర్, విజయలక్ష్మి, సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు తీసుకెళ్లండి

ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



ప్రజాశక్తి -యాదమరి: సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని పూతలపట్టు నియోజకవర్గం ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. బుధవారం కొత్తపల్లి గ్రామంలో ప్రతి గడపనూ సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయ పరిధిలోని వాలంటీర్లు సచివాలయ సిబ్బంది ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన వారికి అందించాలన్నారు. గ్రామంలో కొంతమంది పెన్షన్, జగనన్న ఇల్లు కావాలని ఎమ్మెల్యే దృష్టి తీసుకెళ్లారు. గ్రామానికి చెందిన కొంతమంది రైతులకు ఎక్స్‌ప్రెస్ హైవే ఆరు వరుసల రహదారిలో తమ భూములు కోల్పోయా మన్నారు. అయితే తమకు నష్టపరిహారం మంజూరులో కావడం లేదని గ్రామానికి చెందిన జయలక్ష్మి, రామ్మూర్తి, శంకరయ్య, వెంకయ్య ఎమ్మెల్యే మొరపెట్టుకున్నారు. ఆయన స్పందిస్తూ కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ కాలువలు మంజూరు చేయాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా ఇళ్లను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. నవరత్నాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు ధనంజయ రెడ్డి, మండల అధ్యక్షుడు సురేష్, ఉపాధ్యక్షులు హరినారాయణ రెడ్డి రవీంద్ర, మాజీ జెడ్పిటిసి కోనాపల్లి మనోహర్, మాజీ సర్పంచ్ల సంఘం అధ్యక్షులు మనోహర్ రెడ్డి , సర్పంచులు మీనా మనోజ్ రెడ్డి వాసుదేవ రెడ్డి, జెకె రవి, తహశీల్దార్ చిట్టిబాబు, మండల అభివృద్ధి అధికారి శివరాజ్, ఎస్ఐ సుమన్, ఎంఈఓ రుక్మిణి, ఏపీఎం కల్పలత రెడ్డి, ఏపీఓ కవిత, ఏఈలు గుర్రప్ప,జయ చంద్రారెడ్డి, నవీన్, , శ్రీనివా సులు అన్ని శాఖలమండల స్థాయి అధికారులు, పంచా యతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచులు వైసీపీ నాయకులుశాఖల అధికారులు పాల్గొన్నారు.

భూఆక్రమణపై చర్యలు తీసుకోవాలి



ప్రజాశక్తి-పలమనేరు: వి.కోట మండలం తోటకనుమ గ్రామానికి చెందిన తలారి మునివెంకటప్ప భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకొని అడిగినందుకు ఆయన కుటుంబంపై దౌర్జన్యానికి పాల్పడిన కస్తూరి నగరానికి చెందిన బాలప్పపై వెంటనే చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కులు.. అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా నాయకులు డీవీ మునిరత్నం డిమాండు చేశారు. పలమనేరు కార్యాలయంలో బుధవారం వివిధ సంఘాల నాయకులతో పార్థసారథి అధ్యక్షతన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు డీవీ మునిరత్నం, వేలాయుధం, సోము మాట్లాడుతూ బాధితుడు మునివెంకటప్పకు చెందిన భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంపై బాధితుడు నెలలు తరబడి న్యాయం చేయమని సంబంధిత అధికారుల చుట్టూ తిరుగుతున్నారని వాపోయారు. బాధితుడి వద్ద భూమికి సంబంధించిన అన్ని రికార్డులు పకడ్బందీగా ఉన్నప్పటికీ భూమిలోకి రానివ్వకుండా అడ్డుపడుతున్న ఆక్రమణ దారుడు బాలప్పపై ఇప్పటివరకు ఎందుకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోలేకపోతున్నారో సమాధానం చెప్పాలన్నారు. బాధితునికి న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ప్రజా సంఘాలను సంఘటితం చేసి సమస్య పరిష్కారం అయ్యేవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రవికుమార్, హేమలత, ఆనంద్, మణి బాలచంద్ర, రామ్మూర్తి నాయుడు, వెంకటేష్, రాజా, రమేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని పాతపేట పంచాయతీ గ్రామంలోని కామాల వంక రైతు భరోసా సచివాలయం వెనుక భాగాన గల పంట పొలాల్లో లెవెన్ కె.వి విద్యుత్ లైన్, మోటార్ విద్యుత్ లైన్‌లు కిందికి వేలాడుతున్నాయి. దీనివలన పశువులకు రైతులకు ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ అధికారులు నిద్రమత్తు వీడి జరగబోయే ప్రమాదాలకు అధికారులు స్పందించి ఇక్కడున్న ప్రజలకు విద్యుత్ నుండి రక్షణ కల్పించాలని స్థానిక రైతులు విద్యుత్ అధికారులను కోరుతున్నారు. దీనిపై జిల్లా విద్యుత్ శాఖ, పలమనేరు, బైరెడ్డిపల్లి విద్యుత్ అధికారులు స్పందించాలని కోరుకుంటున్నారు. లేకపోతే బైరెడ్డిపల్లి నాలుగు కూడలి వద్ద ధర్నాకు దిగుతామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు

సిబ్బంది సమయపాలన పాటించాలి



ప్రజాశక్తి-కార్వేటినగరం: సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో సమయ పాలన పాటించాలని ఎంపీడీవో మోహన మురళీ అన్నారు. బుధ వారం మండల పరిధిలోని అన్నూరు సచివాలయాన్ని ఎంపీడీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. బయోమెట్రిక్, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేర వేయడంలో వలంటీర్లతో పాటు సిబ్బంది కీలక పాత్ర పోషించాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా పోలీసులు అంగన్వాడీ కేంద్రాలను పర్యవేక్షించి పిల్లలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం సక్రమంగా అందుతున్నాయా లేదా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శి మనోజ్, సర్పంచ్ సుందర్రాజ్, సచివాలయ సిబ్బంది,, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధనకే పెరటి కోళ్ల పెంపకం



ప్రజాశక్తి-సోమల: మండలంలోని మహిళా సంఘ సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా పెరటి కోళ్లను పంపిణీ చేసినట్లు ఏపీఎం శివ తెలిపారు. బుధవారం మండల సమాఖ్య కార్యాలయం వద్ద మహిళా సంఘ సభ్యులకు పెరటి కోళ్ల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 101 మహిళా సంఘాలకు 11 కోడి పిల్లలు కలిగిన యూనిట్లను అందించా మని.. రూ.3 వేలు సంఘ సభ్యులు చెల్లించినట్లు తెలిపారు. కోళ్ల పెంపకంతో ఆర్థికంగా అభివద్ధి సాధించవచ్చని పేర్కొన్నారు. ఎంపీపీ ఈశ్వరయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు , సీసీలు గంగోజీ, హేమలత, సంఘమిత్రలు మహిళలు పాల్గొన్నారు.

ఓటరు లిస్టు పరిశీలన



ప్రజాశక్తి- వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలంలోని జక్కదొన పంచాయతీ గంటావారిపల్లికి సంబంధించిన ఓటర్ లిస్టును బుధవారం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమినేని చిట్టిబాబు పరిశీలించారు. ఓటు అర్హత ఉండి నమోదు కానివారు ఎవరైనా ఉంటే తమ దష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నరసింహులు యాదవ్, నియోజకవర్గ బీసీసెల్ ఉపాధ్యక్షులు శివరాం యాదవ్, మండల రైతు అధ్యక్షులు రాజారెడ్డి, మాజీ ఎంపీటీసీ మాధవ నాయుడు, జక్కదొన పంచాయతీ పార్టీ అధ్యక్షులు భాస్కర్ యాదవ్, మండల పార్టీ కోశాధికారి మదన్ మోహన్ రెడ్డి, గంటవారిపల్లి పంచాయతీ అధ్యక్షులు వెంకటరెడ్డి, సెక్షన్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయంలోనే ఆధార్ సేవలు



ప్రజాశక్తి-పాలసముద్రం: మండల పరిధిలోని ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం గ్రామ సచివాలయంలోనే ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని తహసీల్దారు బాబు తెలిపారు. బుధవారం పాలసముద్రం గ్రామ సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. సచివాలయంలోనే ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు, కొత్త ఆధార్ కార్డులు తీసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అయ్యప్ప, వైస్ ఎంపీపీ శేఖర్‌యాదవ్, పంచాయతీ కార్యదర్శి నరేష్, సాదు పాల్గొన్నారు.

రైతులు రాయితీ ప్లాస్టిక్ బాక్సులకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: రైతులు రాయితీ ప్లాస్టిక్ బాక్సుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఉద్యాన శాఖాధికారి సాగరిక తెలిపారు. బుధవారం మండలంలోని నల్లగంపల్లి, జంబువారిపల్లి, గొల్లపల్లి పంచాయతీల్లో రాయితీ ప్లాస్టిక్ బాక్సులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యానశాఖ ఆధ్వర్యంబలో రైతులకు 75 శాతం రాయితీతో ప్లాస్టిక్ బాక్సులు పంపిణీ చేపడుతున్నారని.. ముందుగా రైతులు ఒక ట్రేకు రూ.280 చొప్పున నీల్ కమల్ లిమిటెడ్ సికింద్రాబాద్ పేరుతో డీడీ తీయాలని .. అనంతరం రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.180 రాయితీ నగదును తిరిగి చెల్లిస్తుందని.. ఒక్కొక్క రైతుకు 100 బాక్సుల వరకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులు క్రమశిక్షణతోవిద్యనభ్యసించాలి


ప్రజాశక్తి-వెదురుకుప్పం: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని.. ఎస్సై గోపి సూచించారు. బుధవారం వెదురుకుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వినయం, విధేయత, పెద్దలపై గౌరవం ఉన్నప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలిపారు. ఆయన్ను కళాశాల ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారదాదేవి శాలువాతో సన్మానించారు. కళాశాల ప్రాంగణంలో మొక్కను నాటారు. డాక్టర్ పి.వెంకటేశు, ఎన్ఎస్-ఎస్ అధికారి డాక్టర్ మంగల్ గౌరీ, మహిళా పోలీస్ హైమావతి, పోలీస్ కానిస్టేబుళు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లకార్డులతో ఉపాధ్యాయుల నిరసన


ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: యుటిఎఫ్ రాష్ట్ర ధర్నాని భగ్నం చేసిన పోలీసుల, ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా చిత్తూరు ప్రాంతీయ శాఖ ఆధ్వర్యంలో నిరసన జాగరణ కార్యక్రమం స్థానిక టీచర్స్ హోంలో జరిగింది. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవి రమణ, సహధ్యక్షులు రెహానా బేగం, జిల్లా కార్యదర్శులు రెడ్డెప్ప నాయుడు, దక్షిణా మూర్తి, నాయకులు బిర్లా నాయుడు, చిట్టిబాబు, సురేష్, జబ్బరాజ్, చంద్రా, రేవతా పతి పిళ్ళై, సర్దార్, చిరంజీవి, షణ్ముగం, సురేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ఆత్మీయ సమావేశం



ప్రజాశక్తి-పూతలపట్టు: మండలంలోని రంగంపేట క్రాస్‌లోని సుచి సంస్థ కార్యాలయంలో బుధవారం పూతలపట్టు మండలం అంబేడ్కర్ విగ్రహ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మునిరత్నం ఆధ్వర్యంలో మండల ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల సమావేశం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మునిరత్నం మాట్లాడుతూ పూతలపట్టులో అంబేడ్కర్ భవనం.. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం నియోజకవర్గంలోని శుభ పరిణామమని తెలిపారు. ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొని మండల కేంద్రంలో పట్టుదలతో విమర్శలు చేసినా అందరికీ సమాధానం ఇస్తూ నిధులు ఉన్నా.. లేకున్నా పూర్తి చేసేందుకు కషి చేస్తున్న పూతలపట్టు విశ్రాంత ఉపాధ్యాయులు డాక్టర్ జీవరత్నానికి అందరూ రుణపడి ఉన్నామన్నారు. దళిత విగ్రహ కమిటీ కార్యదర్శి బంధార్లపల్లి రామమూర్తి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు కలసి ప్రతి కార్యక్రమానికి విచ్చేసి కార్యక్రమాలను జయప్రదం చేయాలన్నారు. జాయింట్ సెక్రెటరీ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ జీవరత్నం మాట్లాడుతూ మండల కేంద్రంలో అంబేడ్కర్ భవనానికి మాజీ ఎమ్మెల్యే బంగ్లా ఆర్ముగం మొదటగా నిధులు వెచ్చించి భవనానికి పునాది వేసిన ఘనత ఆయనదేనని.. ఆయన సేవలు మరువలేనివని.. ఆయన బాటలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో దళితులందరూ ఐక్యంగా ఉండి అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తూ మండల కేంద్రంలో జరుగుతున్న భవనానికి నిధులు అందించాలన్నారు. నిధులు అందించిన ప్రతిఒక్కరికీ ఆయన కతజ్ఞతలు తెలిపారు. ఎంఎస్ మణి, చెన్నయ్య అంబేడ్కర్‌పై పాటలు పాడి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో జడ్పీటీసీ దేవిక, సర్పంచులు ప్రవీణ్ కుమార్, మోహన్, సుబ్రహ్మణ్యం, బాలాజీ, రామతులసి, ఎంపీటీసీలు షణ్ముగం, రాధా నాగరాజు, కమిటీ సభ్యులు మురుగేశన్, రాజేంద్రయ్య, మండల కో ఆప్షన్ సభ్యులు ఖాదరవల్లి, నాయకులు అమరనాథ్, రషీద్, అర్జున్, జ్యోతి, ఉమాపతి, కాజా వీరభద్రయ్య, సుదర్శన్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో గోకృపామృతంతో అధిక దిగుబడి

కేయం నేచురల్స్ ప్రధాన కార్యదర్శి ప్రేమ్


కొత్తపల్లిలో గో కృపామృతం పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -ఎస్ఆర్‌పురం : సహజ వ్యవసాయం చేసే రైతులకు గోపాల్ భాయ్ షుతారియ ఆవిష్కరించిన గో కృపామృతం అధిక దిగుబడి సంరక్షణ ఓ వరమణి కేయం నేచురల్స్ ప్రధాన కార్యదర్శి ప్రేమ్ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపల్లిలో గత నెలలో గుంటూరులో రైతు నేస్తం జరిగిన గోకృపామృతం దాని విశిష్టత అనే కార్యక్రమం నుంచి కొత్తపల్లి రైతు పార్థసారథి తీసుకొచ్చిన గోకృపామృతాన్ని అభివృద్ధి చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకృపామృతం సహజ సిద్ధంగా తయారు చేసిందని, దీనిలో ఎటువంటి రసాయనాలు లేవని, ఇది ఆరోగ్యానికి మంచిదని, ఒక్కసారి సేకరిస్తే దానిని అభివృద్ధి చేసుకోవచ్చని అన్నారు. ఒక్క లీటర్ గోకృపామృతంను 200 లీటర్ల నీళ్లు, రెండు కేజీల బెల్లం, రెండు లీటర్ల దేశీయ ఆవు మజ్జిగతో కలిపి వారం రోజులపాటు క్రమం తప్పకుండా రోజుకు రెండుసార్లు సవ్య దిశలో కలియబెట్టడం వల్ల గో కృపామృతం తయారవుతుందన్నారు. దీన్ని ఒక ఎకరా పొలానికి ఎరువుగా వాడచ్చని అన్నారు. పంటల్లో చీడపీడల నివారణకు దీన్ని పిచికారి చేయడం వల్ల ఫలితం ఉంటుందన్నారు. అలాగే నీటి ద్వారా పంటకు ఇవ్వడం వల్ల పంటకు పోషకాలను అందించి అధిక దిగుబడిన సాధించవచ్చని ప్రేమ తెలిపారు. నష్టాల బారిన ఉన్న రైతులు రసాయ ఎరువులు పురుగుల మందుల కోసం వేలకు వేలు ఖర్చు పెట్టుకోవడం కన్నా తక్కువ ఖర్చుతో వచ్చే గో కృపామృతాన్ని వాడుకోవాలన్నారు. దీనిని అన్ని రకాల పంటలకు పండ్ల తోటలకు వాడుకోవచ్చు అని, ఉచితంగా పంపిణీ చేస్తామని, రైతులకు దీనిపై సలహాలు సూచనల కోసం 6305885272, 9948463093లలో సంప్రదించాలన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై జెడ్పీ చైర్మన్ సమీక్ష



ప్రజాశక్తి-పెద్దపంజాణి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుపై బుధవారం మండల అభివృద్ధి కార్యాలయంలో అధికారులు, మండల నాయకులతో జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు(వాసు) సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నాడు-నేడు, కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలో రూపురేఖలు మారనున్నాయని కాంట్రాక్టర్లు పాఠశాల భవనాల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా జగనన్న కాలనీలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇళ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి అయ్యేందుకు లబ్ధిదారులకు సహకారం అందించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంపీపీ రెడ్డప్ప, ఎంపీడీవో భాస్కర్, మండల నాయకులు, బుజ్జిరెడ్డి, తమ్మిరెడ్డి, బొమ్మరాజుపల్లి అమర్నాథ్ రెడ్డి, శంకర్రాయల పేట శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రామదూత స్వామిపై చర్యలు తీసుకోండి: జనసేన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుమల శ్రీవారికి వాహనమైన గరుడ ఆకారాన్ని కలిగి రామదూత స్వామి పాదాలను మొక్కుతూ ఉన్న ఫొటోలతో ముద్రించిన 2023 కాలమాన పట్టిక శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉందని, ఈ చర్యకు ఉపక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బుధవారం అలిపిరి పోలీసులకు జనసేన పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. తిరుమల బ్రహ్మోత్సవాల్లో గరుడ వాహనానికి ఎనలేని ఖ్యాతి ఉందని, అటువంటి గరుడని రామదూత స్వామి పాదాలు మొక్కుతున్నట్టుగా కాలమాన పట్టికను తయారు చేయించడం, ఈ కాలమాన పట్టికను సాక్షాత్తు రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి ఆవిష్కరించడం శ్రీవారి భక్తులకు మరింత ఆగ్రహ వేశాలు తెప్పిస్తోందన్నారు. ఈ ఘటనపై తిరుమల తిరుపతి దేవస్థానం వెంటనే స్పందించి విచారణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ తిరుపతి పట్టణ అధ్యక్షుడు రాజారెడ్డి, సుభాషిని, హేమకుమార్, రాజమోహన్ పాల్గొన్నారు.

హిందీ భాషపై పట్టు సాధించండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

విద్యార్థులు హిందీ భాషపై మంచి పట్టు సాధించాలని, భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు పొందవచ్చని మంగళం ట్రెండ్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి. కేశవులు నాయుడు విద్యార్థులకు సూచించారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళం ట్రెండ్స్ లో తిరుపతి అర్బన్ కు చెందిన 75 మంది విద్యార్థినీ విద్యార్థులు దక్షిణ భారత హిందీ ప్రచార సభ, మద్రాసు వారి ద్వారా సెప్టెంబర్ నెలలో నిర్వహించిన ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర భాష తదితర పరీక్షలలో ఉత్తీర్ణులయ్యారన్నారని కేశవులు నాయుడు తెలిపారు. హిందీ ద్వారా భవిష్యత్తులో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ప్రజాశక్తి-నగరి: రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజా సోదరులు రామ్‌ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా నగరి మండలం బీరకుప్పం గ్రామానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న సుబ్రహ్మణ్యం, రోశమ్మలకు రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. అలాగే విజయపురం మండలం ఆలపాకం గ్రామానికి చెందిన రాజేంద్రన్ క్యాన్సర్ శస్త్రచికిత్స కోసం రూ.50 వేలు, నింద్ర మండలం కేఆర్‌పాలెం సర్పంచ్ శేఖర్ మామ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబానికి రూ.50 వేలు అందించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఫిర్యాదు



ప్రజాశక్తి-వెదురుకుప్పం: తెట్టుగుంటపల్లి రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన పలవురు జేసీబీ, ట్రాక్టర్లతో చదును చేసి గట్లు వేశారని.. అధికారులు స్పందించి వెంటనే ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవాలని తహసీల్దారు పుల్లారెడ్డికి బుధవారం గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. 20 ఏళ్ల క్రితం భూమేపల్లికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకొని కంచె వేయడంతో కలెక్టర్ దష్టికి తీసుకెళ్లగా అధికారులు కంచెను తొలగించారని తెలిపారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.



క్రీడాకారులను ప్రోత్సహించడం అందరి బాధ్యత

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: క్రీడాకారులను ప్రోత్సహించడం అందరి బాధ్యతని ఎంపీటీసీ హేమచంద్ర అన్నారు. బుధవారం మండలంలోని తగ్గువారిపల్లి గ్రామంలో నియోజకవర్గ సీఎం కప్ వాలీబాల్ విజేతలు బేబీ, రజిని, రేవతిలను సన్మానించారు. గ్రామీణ స్థాయిలో క్రీడలను అలవాటు చేసుకోవాలని.. క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు మంజునాథ్, మహేంద్ర, బాబు, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి బహిరంగ సభకు సోమల నేతలు



ప్రజాశక్తి-సోమల: అన్నమయ్య జిల్లా మదనపల్లెలో బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బహిరంగ సభకు సోమల మండలం నుంచి అధిక సంఖ్యలో వైసీపీ నాయకులు తరలివెళ్లారు. అన్ని పంచాయతీల నుంచి బస్సులు, కార్లు ఇతర వాహనాల ద్వారా సభకు వెళ్లి పాల్గొన్నారు. ఎంపీపీ ఈశ్వరయ్య, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నాగేశ్వరరావు, అమాస మోహన్, మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగాధరం రాయల్, వైస్ ఎంపీపీ ప్రభాకర్, సర్పంచులు తదితరులు వెళ్లారు.

రైతు భరోసాకు దరఖాస్తులు

ప్రజాశక్తి-గుడిపల్లి : రైతు భరోసా కోసం రైతులు కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ప్రస్తుతం ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో నాగరాజు తెలిపారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకంతోపాటు ఆధార్ కార్డు, 1-బి, రేషన్ కార్డు జిరాక్స్ తీసుకొని రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

52 మందికి వైద్య పరీక్షలు



ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఆవులపల్లె గ్రామంలో పెద్ద ఉప్పరపల్లి వైద్యాధికారిణి సోనియా ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 52 మంది వద్ధులు, మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో వైద్య పర్యవేక్షకులు చంద్రమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు చీకటిపల్లిలో 'గడపగడపకూ మనప్రభుత్వం'

ప్రజాశక్తి-గుడిపల్లి: గుడిపల్లి మండలం చీకటిపల్లి పంచాయతీలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జడ్పీటీసీ సభ్యులు కృష్ణమూర్తి తెలిపారు. ఎమ్మెల్సీ భరత్ చీకటిపల్లిలో పాల్గొని ప్రజా సమస్యలకు పరిష్కారం చూపుతారని పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని కోరారు.

విద్యార్థులకు గ్లాసుల పంపిణీ




ప్రజాశక్తి-సోమల: మండలంలోని నెల్లిమంద పంచాయతీ ఎగువపల్లి ఎంపీపీ పాఠశాలలో పాఠశాల కమిటీ ఛైర్మన్ రఘుపతి తన సొంత ఖర్చులతో 20 మంది విద్యార్థులకు గ్లాసులను పంపిణీ చేశారు. నీటితో పాటు రోజూ రాగి జావా తాగేందుకు ఉపయోగపడతాయన్న ఉద్దేశంతో ఉచితంగా పంపిణీ చేసినట్టు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు భాస్కర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

జెడ్పిటిసికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



ప్రజాశక్తి -బంగారుపాళ్యం: జెడ్పిటిసి సోమశేఖర్‌కు పూతలపట్టు శాసనసభ్యులు ఎమ్మెస్ బాబు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి కొద్ది కాలంలోనే ప్రజల ఆదరాభిమానాలను పొందిన జెడ్పిటిసి సోమశేఖర ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ముందుంటారన్నారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జగదీష్, గోపి, సుబ్రహ్మణ్యం, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే



ప్రజాశక్తి -బంగారుపాళ్యం : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని బుధవారం రేణిగుంట విమానాశ్రయంలో పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

క్రైం న్యూస్

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి



ప్రజాశక్తి -వీకోట : మండల పరిధిలోని కస్తూరి నగరం అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగు చేస్తుంది. ఎస్ఐ రాంభూపాల్ కథనం మేరకు వివరాలు మండల పరిధిలోని కస్తూరి నగరం అటవీ ప్రాంతంలో సుమారు 70 సంవత్సరాల వయస్సు గల వృద్ధుడు నెల రోజుల క్రితం మృతి చెంది గుర్తుపట్టలేని స్థితిలో పడి ఉండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వృద్ధుడి శవాన్ని గుర్తుపట్టే స్థితిలో లేకపోవడంతో అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

బాలికలను వేధిస్తున్న యువకుడి అరెస్టు



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఓ బాలికను వేధిస్తున్న యువకుడిని అరెస్టు చేసినట్టు సీఐ నరసింహారెడ్డి తెలిపారు. మండలంలోని మొగిలి పంచాయతీ మిట్టూరు గ్రామానికి చెందిన రజిత్ అదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమించమని వేధించడంపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

కోర్టు అనుమతితోనే ఫోరెన్సిక్ ల్యాబ్‌కు సెల్‌ఫోన్లు



ప్రజాశక్తి-నగరి: ఈనెల 11వ తేదీన జనసేన నాయకుడు కిరణ్ రాయల్‌ను నగరి పోలీసులు అరెస్టు చేసి నగరి కోర్టులో ప్రవేశ పెట్టడం జరిగిందని ఆ సమయంలో రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని మంగళగిరిలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపామని.. ఇందుకు నగరి కోర్టు అనుమతి తీసుకున్నామని డీఎస్పీ రవికుమార్ తెలిపారు. బుధవారం ఓ పత్రికలో నగరి పోలీస్ స్టేషన్లో సెల్‌ఫోన్లు మాయమంటూ తప్పుడు కథనాలు ప్రచురించాని పేర్కొన్నారు.

చెంగల్రాయలు రెడ్డి కుటుంబానికి పరామర్శ



ప్రజాశక్తి - ఎస్ఆర్‌పురం : వైసీపీ కార్యకర్త చంగల్రాయలు రెడ్డి కుటుంబాన్ని ఏపీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి బుధవారం పరామర్శించారు. మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చెంగల్రాయల్ రెడ్డి చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అభివృద్ధికి, ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో చంగల్ రాయల్ రెడ్డి పార్టీ గెలుపుకు ఎనలేని కృషి చేశారన్నారు. నేడు రోడ్డు ప్రమాదంలో మరణించడం పార్టీకి తీరని లోటన్నారు. ప్రభుత్వం తరపున వారి కుటుంబ సభ్యులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ప్రమాదానికి గురైన వాహనాన్ని త్వరగా ఛేదించాలని పోలీసులును ఆదేశించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ ధనుంజయులు, ఎంపీటీసీ సభ్యులు ఆదిలక్ష్మి, నాయకులు విజయ బాబు, డిసెంబర్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

బిందు సేద్యం పరికరాలు పంపిణీ..!



ప్రజాశక్తి- రామకుప్పం: ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీ ద్వారా డ్రిప్ వ్యవసాయ పరికరాలు పంపిణీ చేశారు. బుధవారం రామకుప్పం మేజర్ గ్రామపంచాయతీ, 89 పెద్దూరు గ్రామాల్లో సర్పంచ్ మురళి, రైతు భరోసా సిబ్బంది అందించారు. డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలు సబ్సిడీలో కావాల్సిన రైతులు తమ గ్రామ పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో తమ పొలం పాసుబుక్, ఆధార్ కార్డు, పొలం స్కెచ్, బోర్ సర్వీస్, రేషన్ కార్డు, ఒక పాస్ పోర్ట్ పోటో, పోన్ నెంబర్‌ను రైతు భరోసా కేంద్రం సిబ్బందికి ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆర్టికల్చర్ అధికారి ప్రియా, రైతు భరోసా కేంద్రం అధికారిణి మధురవాణి, సచివాలయం కార్యదర్శి యువరాజ్, గోవిందప్ప, వార్డు సభ్యులు అబ్దుల్, కృష్ణ ప్రసాద్, గోపికృష్ణ, రైతు భరోసా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫిజిక్స్ విద్యార్థులను అభినందించిన వీసీ



ప్రజాశక్తి - క్యాంపస్ : తమిళనాడులోని శివనాడార్ యూనివర్సిటీలో 2023 జనవరి 20 నుంచీ ఫిబ్రవరి 10 వ తేదీ వరకూ నిర్వహించే జాతీయ స్థాయి ఫిజిక్స్ నైపుణ్య శిక్షణకు ఎస్వీయూ ఫిజిక్స్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో ఎంఎస్సీ ఫిజిక్స్ రెండవ సెమిస్టర్ విద్యార్థిని ఎస్. శిరీష, పీహెచ్.డీ స్కాలర్ పి. పవిత్ర ఉన్నారు. పీహెచ్.డీ స్కాలర్ పి. పవిత్ర, ఫిజిక్స్ విభాగంలో ప్రొఫెసర్ దేవప్రసాదరాజు పర్యవేక్షణలో పరిశోధన చేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 40 మంది ఫిజిక్స్ విద్యార్థుల్లో వీరు ఉండటం గమనార్హం. ఫిజిక్స్ రంగంలో గత ఆవిష్కరణలు, పరిశోధనలకు సంబంధించిన అంశాలపై ఈ శిక్షణా కార్యక్రమంలో అవగాహన కల్పిస్తారు. ఈ సందర్భంగా ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ కె. రాజారెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.పి. విజయలక్ష్మి, ప్రొఫెసర్ బి. దేవప్రసాద రాజు పాల్గొన్నారు.